# పేలావతారం

సుధేష్ణారెడ్డి, La Plata, MD

ఆ ఆదివారం మా అత్తగారున్నారని పెందరాళే లేచి కాఫీ చేస్తున్నాను. మా అత్తగారు స్నానం చేసి, పూజకానిచ్చి బీరకాయ కబుర్లు చెబుతున్నారు. ఈ అమెరికాలో బీరముక్కలు వేయించి ఆపళాన తినేస్తారు (పాన్ ఫ్రై అంటారు.) చక్కగా నువ్వుపొడి వేసి కాసిన్ని పాలుపోసి చేస్తే, ఆ కూర ఎంతవండినా చివరతినే వాళ్ళకి దొరకదట (ఇండియాలో ఇక్కడలాగా అందరూ ఒకేసారి ఆడా, మగా కలిసి కూర్చుని తినరుగా.) అందుకే ఈ కూరని ఆడబిడ్డల కూర అంటారట – అని మా అత్తగారు చెప్తున్నారు. పద్ధతి ప్రకారం చివర తినే కోడళ్ళకి ఆకూర దొరకదు గాబోలు. ఆ కబుర్లువింటూ కాఫీ ఆవిడ చేతికిచ్చి నేను అరంగుళాల పొడవున్న మగ్గులో కాఫీ తీసుకొని అత్తగారి దగ్గర మరికొన్ని బీరకాయ కబుర్లకోసం కూచున్నాను. మా అత్తగారి కబుర్లువింటే కాలం ఇట్టే రేసులో హార్సులా కదలిపోతుంది. నవ్వుతూ, తానొవ్వక, ఢమరుక చప్పుడు చేయక, పక్కింటి కప్పులేపువారు ధన్యులు సుమతీ! అన్నట్లు కొందరు చిన్నగా నవ్వుతూ ఇతరుల ఇంటికప్పు, నెత్తికొప్పు ఊడబెరికి ఊళ్ళో మంచివాళ్ళుగా చలామణి అయ్యేవాళ్ళున్నారు కాని, మా అత్తగారు కబుర్లలో ఏనాడు ఎవ్వరి పరువునుగాని, పవరునుగాని వేలం వేయరండి. నా ఫ్రెండ్సంతా మా అత్తగారున్నారంటే ఆవిడతో కబుర్లు చెప్పుకుంటారు. నాకు మొదట్లో జెలసీగా ఉండేది. జాహ్నవి అత్తగారు వచ్చినపుడు–ఆవిడతో మాట్లాడితేనే చిరాకు పడిపోయేది. అందరూ ఊరుకుంటారా! గుసగుసలు ఊదేసారు. అదిచూసి నా జెలసీని పింక్ రంగులోకి మార్చుకున్నాను. ఆవిడకి కొడుకంటే ప్రాణం. గ్రాండు చిల్రను అంటే వాళ్ళకు గాలి గట్టిగా తగలనివ్వరు. నాతరం మనిషి కాకపోయినా ఆడవాళ్ళ రైట్స్ అంటే మల్లెతీగలా అల్లుకుపోతారు. ఎనీవే, కాఫీ సిప్ అవుతుండగా డోర్‌బెల్ వినిపించింది. తలుపు కన్నంలోంచి చూస్తే ఎదురింటావిడ నుంచుంది. ఆవిడెప్పుడొచ్చినా వెనకాలే ముగ్గురమ్మాయిలు, ఒక అబ్బాయి గునగున లాడుతూ వచ్చేస్తారు. ఆదివారం అంత పొద్దున్న ఏమిటా! అని నైట్‌గౌన్ సరిచేసుకుని తలుపు తీసాను––ఆవిడ మొహంలో గాభరాచూసి 'వ్హాట్ హాప్పెన్డ్' అని అడిగాను.

'ఐయామ్ సారి టు డిస్టర్బ్ యు ఆన్ సన్‌డే మార్నింగ్––లుక్ ఎట్ దిస్! హెల్ప్ మి వాట్ టు డూ.' అంటూ చేతిలో ఉన్న ప్లాస్టిక్‌బేగ్‌ను ఒక చేతిలోంచి మార్చి దూరంగా పట్టుకుంది. ఆ బేగ్‌ని, ఆమెని చూస్తున్న అత్తగారు, 'ఆ సంచిలో ఏముందే! మడికట్టుకున్నదన్లా అలా దూరంగా పట్టుకుంది'

'కిమ్! ఆ బేగ్‌లో ఏమిటి'

'ఐయామ్ వర్రీడ్. లుక్ ఎట్ దీస్ ఇన్‌సెక్ట్స్! ఐ ఫౌండ్‌దెమ్ ఇన్ కేటీస్ హెయిర్' పదేళ్ళ కేటి తలకి స్కార్ఫ్ కట్టుకుంది.

'మిసెస్ ఢీ ( నా పేరు దేవకి. పేరును కూనిచేయడంలో వీళ్ళను మించిన వాళ్ళు ఉండరు.) ఎస్టర్‌డే ఐ స్క్రాచ్‌డ్ మై హెయిర్– వావ్! యూ డోన్ట్ బిలీవ్ వాటైగాట్! ఐ గాట్ లైవ్ ఇన్‌సెక్టట్ ఇన్‌మై నెయిల్.' అంటూ ఒక్క గుక్కలో చెప్పి, చేతిలోఉన్న నేప్‌కిన్ తెరిచి చూపించింది.

'దేవకీ! ఏమయిందట?' అత్తగారు ఆత్రంగా అడిగారు.

'తల్లో పేలున్నాయట.'

'థాంక్ గాడ్! నీ రూములోంచి మారుతాను. నా పిల్లోకూడ నువ్వే తీసుకో' సిసింద్రీ లాంటి మిలనీ అంది.

కిమ్ పిల్లలందరిని టి.వి. ముందరకు తోసి నన్ను చేయి పట్టుకుని బాత్‌రూంలోకి తీసికెళ్ళి––ప్లాస్టిక్ బేగ్‌లోని–సో కాల్డ్ ఇన్‌సెక్ట్స్‌ను చూపించింది. కేటీ బెడ్‌షీట్లన్నీ వాష్ చేసిందట. పేలని తెలిసినా ఒసారి షీటులోకి తొంగిచూసాను. అందులో చచ్చిన పేలున్నాయి. కేటి తల్లో ఇంకా ఉన్నాయి. ఏంచెయ్యాలి అని గాభరా పడుతూ అడిగింది. 'డు యు థింక్ షి షుడ్ సీ హర్ పీడియాట్రీషన్?'అంది. అంత వర్రీ కావలసిన పనిలేదు. క్వెల్ షాంపూ వాడు అని చెప్పాను. పేలు తల్లోతప్ప ఎక్కడా ఉండవని మనకి తెలిసినట్లు వీళ్ళకి తెలీదు. అత్తగారు కేటి తల స్కార్ఫ్ ఊడదీసి తల పాయలుగాచేసి ఒ పేనుతీసి బొటనవేలి గోరుమీద పెట్టి గబుక్కున రెండో బొటనవేలి గోరుతో హత్య చేశారు. కిమ్ గుడ్లప్పగించి చూస్తోంది. 'అలా తల్లో చెయ్యిపెడ్తే వాళ్ళకి నచ్చదు.' అని చిన్నగా అన్నాను. అత్తగారు గబుక్కున చేయి తీసేసుకున్నారు.

'వాష్ యువర్ హేండ్స్. స్టోర్స్ తెరవగానే షాంపూ తెస్తాను.' అంటూ కిమ్ వెళ్ళిపోయింది.

'నల్లగా నిగనిగలాడుతూ ఉండాల్సిన జుట్టు– ఎండుగడ్డిలా, పీచుపీచు పిట్టలగూడులా ఉందేమిటి! ఆ పేలు గూడ పాలిపోయినట్లున్నాయి. వాళ్ళ రక్తంతాగి వాటికారంగు వచ్చిఉంటుంది. మన తల్లో పేలు నల్లగా ఉంటాయి.'

మన వెంట్రుకలు నలుపే కాని అందరి రక్తం ఒకేరంగులో ఉండాలే! ( రాయల్ బ్లడ్ బ్లూ అనుకునే విజ్ఞానులున్నారుగా!)

'అనిటా! డోంట్ టచ్ కేటీ, ఉయ్ విల్ త్రో హర్ ఇన్ టుది బేస్‌మెంట్' అదేదో కోరంటీన్ చేస్తున్నట్లు చెప్పింది.

'ఇదేం విడ్డూరమే! తల్లో పేలుంటే రోజు బట్టలన్ని వాష్ చేస్తానంటుందేమిటి! సన్న పళ్ళ దువ్వెనతో దువ్వేస్తే పోయె.'

'వీళ్లకవన్నీ తెలియవు. పేలకి షాంపూ వాడతారు. ఈర్లకి (ఎగ్స్) వినేగర్ నీళ్ళలో కలిపి వాడతారు'.

'నా చిన్నప్పుడు గొల్లరంగి అందరి తల్లో పేలు, ఈర్లు చేయితో తీసేసేది. దాని తొడమీద తలపెట్టి అది పేలు చూసేలోగా హాయిగా నిద్ర పోయేదాన్ని.'–అత్తగారు చిన్ననాటి మురిపాలు చెప్తున్నారు.

ఒకరోజు బీరకాయలు తెచ్చాను. అత్తగారు చెప్పినట్లు కూరచేయాలి. గుత్తిబీరకాయ కూర వండడానికి సరంజామ ఒకచోట చేర్చుతున్నాను. డోర్‌బెల్ వినిపించింది. అత్తగారు వెళ్ళారు.

'హల్లో పేలావతారం! కమిన్'

నా పక్కనే నన్ను సాధిస్తున్న అనిత 'మామ్, కేటీ ఈజ్ హియర్. ఐ గాట్టుగో' ఝుమ్మంటూ వెళ్లిపోయింది......